ప్రజాశక్తి

మంగళవారం 25 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

కూటమి ప్రభుత్వానికి..

సమస్యల సవాళ్లు

- ఎన్ఎడిబి నిర్వాసితులకు నేటికీ అందని పరిహారం, ప్యాకేజీ
- విశాఖ - చెన్నయ్ కారిడార్ భూ నిర్వాసితులకు దక్కని నష్టపరిహారం
- నిధుల్లేక సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు
- ఐదో షెడ్యూల్‌లో చేర్చక నాన్‌షెడ్యూల్ గిరిజనుల అవస్థలు
- అభివృద్ధి అడుగులు పడాలని ప్రజల ఆకాంక్ష



పెద్దకలవలపల్లిలో ఎన్ఎడిబి నిర్వాసితుల ఆందోళన (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి కొత్త ప్రభుత్వం ముందు జిల్లాలోని అనేక పాత సమస్యలు సవాలుగా ఉన్నాయి. గత ప్రభుత్వం వలే కూటమి ప్రభుత్వం కాలం నెట్టుకొస్తుందో, దశలవారీగా ప్రతిపాదిత సాగు నీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత సాధనకు కృషి చేస్తుందో, లేదో చూడాల్సి వుంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారిలో వంగలపూడి అనిత హోంశాఖ మంత్రిగా, సిహెచ్.అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా వున్నారు. మరో ఐదుగురు కూటమి ఎమ్మెల్యేలు, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ ఎంతవరకూ జిల్లా సమస్యలపై స్పందించి శ్రద్ధచూపుతారో చూడాల్సివుంది.

వాస్తవానికి జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలెదుర్కొంటున్న సమస్యలేవీ ఈ ప్రభుత్వానికి కొత్తకావు. గతంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాల్లో నిర్లక్ష్యం చేయబడిన, నిరాకరించిన సమస్యలతోనే ప్రజలు బాధపడుతున్నారు. హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం మిగతా 2లో..



ఎం.శ్రీభరత్ (విశాఖపట్నం)



సిఎం.రమేష్ (అనకాపల్లి)

ఘనంగా ఎంపీల ప్రమాణ స్వీకారం



జి.తనూజారాణి (అరకు)

ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అరకు పార్లమెంట్ స్థానాల నుంచి గెలుపొందిన ఎంపీలు ఎం.శ్రీభరత్, సిఎం.రమేష్, జి.తనూజారాణిలు సోమవారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. వారికి పలువురు అభినందనలు తెలియజేశారు.

భారత్ టి-20లోకి విశాఖ కుర్రాడు

వార్త 2లో..

నీట్‌లో అక్రమాలపై సిపిఎం నిరసన

వార్త 5లో..

ఎయులో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

వార్త 2లో..

జన్మభూమి రైలు సేవలు కొనసాగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూన్ 23 నుంచి ఆగస్టు 11 వరకు విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల దృష్ట్యా రద్దు చేయబడిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రజల డిమాండ్‌తో కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి ఆగస్టు 10 వరకు, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి ఆగస్టు 11 వరకు పునరుద్ధరించబడతాయని, దాని షెడ్యూల్, స్టాపేజ్‌లు యథాతథంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఆ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

రైళ్ల రద్దు / స్టేషన్ల ఉపసంహరణ

జబల్‌పూర్ డివిజన్, వెస్ట్ సెంట్రల్ రైల్వేలో డబ్లింగ్, ప్రీ-నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 18573 విశాఖపట్నం-భగత్‌కి కోఠి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 27 నుంచి జులై 4 వరకు, 18574 భగత్ కి కోఠి - విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 29 నుంచి జులై 6 వరకు, 20807 విశాఖపట్నం - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను జులై 5, 6, 9 తేదీల్లోనూ, 20808 అమృత్‌సర్ మిగతా 2లో..



విశాఖలో వినతులు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్

వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కదిలొచ్చిన జనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి విలేకరులు

సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టరేట్లలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జనం పోటెత్తారు. వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్, అనకాపల్లి కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి బాధితుల కష్టాలను విని పరిష్కార మార్గాలను చూపించారు.

వార్తలు లోపల పేజీల్లో...

మొదటి పేజీ తరువాయి..

సమస్యల సవాళ్లు

వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌తో భూములు కోల్పోయిన ఐదు పంచాయతీలు, 11 గ్రామాల నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి. నక్కపల్లిలో డిగ్రీ కాలేజీ విద్యార్థులకు భవనాల్లేక జూనియర్ కాలేజీలో ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నారు. నక్కపల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ లేక రహదారి ప్రమాదాల్లో గాయపడ్డవారు ఇతర ఆస్పత్రులకు వెళ్లేలోపు మృత్యువాతపడుతున్నారు. అసంపూర్తిగా నిలిచిన ఉద్దండపురం తాగునీటి పథకం పూర్తిచేయాల్సివుంది. తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి పునరుద్ధరించాలి. కోటవురట్ల మండలం జల్లూరు, ఎండపల్లి మధ్య వరహానది బ్రిడ్జి నిర్మాణ పనులు, రామచంద్రాపురం-పందూరు గ్రామాల మధ్య వరహా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. ఎన్ఎఓబి నిర్వాసిత మత్స్యకారులకు బోట్ల పరిహారం ఇవ్వలేదు. ఉపాధి కోల్పోయిన బాధిత నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించలేదు. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాలు సహా నక్కపల్లి హెటిరో, డెక్కన్ కెమికల్ పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉపాధి లభించేలా శ్రద్ధ చూపాలి. పరిశ్రమల ప్రమాదాలు, కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా ఇవ్వాల్సివుంది. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఫిషింగ్ హార్బర్, నక్కపల్లి మండలం రాజయ్యపేట, దొండవాకలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించాలి. అనకాపల్లి జిల్లా కేంద్రంలో మురుగునీరు పోయేలా కాలువ నిర్మాణాలు చేపట్టి దోమల సమస్యను పరిష్కరించాలి. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి. సబ్బవరంలోని జాతీయ విద్యా సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (పెట్రోలియం యూనివర్సిటీ)కి శాశ్వత భవనాలు లేక ఆంధ్రాయూనివర్సిటీలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ఆయా సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది.

సుజల స్రవంతికి నిధులు కేటాయించాలి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 3.25 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల మరమ్మతులు చేపట్టకపోవడంతో శివారు ప్రాంత ఆయకట్టుకు సాగు నీరందని పరిస్థితి కొనసాగుతోంది. ఆయా సమస్యలపైనా దృష్టి పెట్టాలి. జిల్లాలోని మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం నియోజకవర్గాల్లోని తొమ్మిది నాన్ షెడ్యూల్ మండలాలు, 58 పంచాయతీల్లో 320 నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి రెండు ప్రభుత్వాలూ విస్మరించాయి. ఈ డిమాండ్‌పై ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఎంతో కాలం పోరాడింది. నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల్లేక అక్కడి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ప్రధానమైన సమస్యల పరిష్కారంపై బిజెపి ఎంపీ సిఎం రమేష్, కూటమి ఎమ్మెల్యేలు మాటకు కట్టుబడతారా ? గెలిపించిన ప్రజలకు పంగనామం పెడతారా ? అనేది కాలక్రమంలో తెలుస్తుంది.

జన్మభూమి రైలు సేవలు కొనసాగింపు

- విశాఖపట్నం హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను జులై 6, 7, 10 తేదీలలోనూ రద్దు చేశారు. 20807 విశాఖపట్నం - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 25, 28, 29, జులై 2 తేదీలలో మలేడి స్టేషన్‌లో స్టాపేజీను తొలగించారు. ప్రజలు ఆ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే అధికారులు కోరారు.



సమావేశంలో పాల్గొన్న పలు పార్టీల, ప్రజా సంఘాల నాయకులు

ఎయులో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐదేళ్లుగా ఆంధ్రా యూనివర్సిటీలో కొరవడిన ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని విద్యార్థి, యువజన ప్రగతిశీల సంఘాలు కోరాయి. ఆంధ్రా యూనివర్సిటీలో సోమవారం ఉదయం ఎయు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ సమావేశంలో వక్తలు ప్రసంగించారు. వర్సిటీలో ఐదేళ్లుగా వీసీ ప్రసాదరెడ్డి నియంతృత్వ పాలనలో విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. వర్సిటీ భవనాలు, భూములు, ఆస్తులను తన ఇష్టానుసారంగా లీజులకు ఇచ్చేసారన్నారు. పరిశోధనా రంగాన్ని వ్యాపార రంగంగా మార్చేయడాన్ని నిరసించారు. గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించడం, ఎయిడెడ్ అధ్యాపకులను డిప్యూటేషన్ పేరుతో తీసుకొచ్చి విద్యావ్యవస్థను నాశనం చేయడాన్ని తప్పుపట్టారు. కక్షసాధింపు చర్యలను, యూనివర్సిటీ క్వార్టర్స్‌ను వ్యాపారం కోసం కూల్చేయడం తదితర చర్యలను దుయ్యబట్టారు. డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత్ బచావో విశాఖ జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్ఆర్.వేమన, ఆప్ నాయకులు డాక్టర్ సీతల్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, లోకసత్తా నాయకులు సుధీర్, విరసం నాయకులు బూసి వెంకటరావు, భీంసేన వార్ నాయకులు చిన్నారావ్, సిఐటియు నాయకులు అప్పారావు, డివైఎఫ్ఐ నాయకులు యుఎస్ఎన్.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు సహా పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కదిలొచ్చిన జనం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఆశా కార్యకర్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆశా వర్కర్లపై పని భారం తగ్గించాలని, అడల్ట్ బిసిజి వాక్సినేషన్‌పై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ తర్వాత ప్రజలు అడల్ట్ బిసిజి వాక్సిన్ వేసుకోవడానికి ఇష్టపడటం లేదన్నారు. ఆ వ్యాక్సిన్ వల్ల ప్రజలకు ఏమీ జరగదన్న భరోసా ఇవ్వాలని ఆశాలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఎలక్షన్ డ్యూటీ చేసినా రెమ్యూనరేషన్ పెందుర్తి, భీమిలి, సౌత్ నియోజకవర్గాల్లో ఇంకా ఇవ్వలేదని, వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలని కోరారు. 2022, 23 సంవత్సరాలలో 230 మంది ఆశాలకు రెండుసార్లు ట్రైనింగ్ ఇచ్చారన్నారు. 3, 4, 5, 6 మాడ్యూల్స్ ట్రైనింగ్ డబ్బులు ఇంతవరకూ చెల్లించలేదని, వాటిని చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎస్.పద్మ, ప్రధాన కార్యదర్శి వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం, ఉపాధ్యక్షురాలు దయానా తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికుల సమస్యలపై వినతి

విశాఖ జిల్లాలో ఉన్న 8 ప్రభుత్వ జిల్లా ఆసుపత్రుల్లో థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల సమస్యలను కాంట్రాక్టర్స్ వెంటనే పరిష్కరించాలని విశాఖపట్నం ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 549 ప్రకారం రూ.16 వేలు జీతం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టర్లు ఇటు వర్కర్ నుంచి, అటు యాజమాన్యం నుంచి పిఎఫ్, ఇఎస్ఐలు రికవరీ చేసి కేవలం ఒకవైపుకు మాత్రమే రూ.11,200 చెల్లిస్తున్నారన్నారు. తక్షణం జిఒ ప్రకారం జీతాలు అందే విధంగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఛైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పనిభారాన్ని తగ్గించాలని విన్నవించారు. టిబి హాస్పిటల్‌లో కార్మికులపై కాంట్రాక్టర్ కక్ష సాధింపు చేస్తున్నారని తెలిపారు. విక్టోరియా గోషా హాస్పిటల్‌లో పిఎఫ్ కట్టలేదని అడిగినందుకు రాగిణి. ఆదిలక్ష్మిలను కృష్ణ కన్స్ట్రక్షన్ కాంట్రాక్టర్ అన్యాయంగా తొలగించారని తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో విమ్స్ హాస్పిటల్ నుంచి డి.రాజేశ్వరి, అన్నపూర్ణ, వై.కనకరాజు, టిబిహెచ్ నుంచి డి.భాగ్య, కేశవరావు, పోతురాజు, మానసిక వైద్యశాల నుంచి పి.రాజు, బాలాజీ, వివిధ హాస్పిటల్స్ శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేటర్స్ ద్వారా నియమితులైన శానిటరీ వర్కర్స్‌కు బకాయి జీతాలు తక్షణం చెల్లించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి ప్రధాన మెడికల్ ఆఫీసర్‌కు ఈ మేరకు ఆయన వినతి పత్రం సమర్పించారు.

సిపి కార్యాలయానికి 66 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ ఆధ్వర్యంలో సిపి కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 66 మంది ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కె.ఫక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసిలో 72 వినతులు

జివిఎంసిలో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (డెవలప్‌మెంట్) కెఎస్.విశ్వనాధన్, డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీర్లు పాల్గొన్నారు.

కెజిహెచ్ గ్రేడ్ - 1 సూపరింటెండెంట్‌గా

పద్మావతి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్) గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సిహెచ్.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో గ్రేడ్ - 2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన పద్మావతికి తాజాగా ఉద్యోగోన్నతి లభించడంతో ఆమె కెజిహెచ్‌లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె సూపరింటెండెంట్ డాక్టర్ శివానందను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కెజిహెచ్ నర్సింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయడంతో పాటు హెడ్ నర్స్, స్టాఫ్ నర్స్‌లను, కాంట్రాక్ట్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ బాధ్యతగా పనిచేస్తానని, రోగులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందీ లేకుండా సూపరింటెండెంట్ ఆదేశాలు పాటిస్తూ పని చేస్తానన్నారు. కెజిహెచ్‌పై తనకు పూర్తిస్థాయి అవగాహన ఉందని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా గ్రేడ్ 2 సూపరింటెండెంట్ కల్పనా మౌళితో పాటు ఎపి నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు బి.భాగ్యలక్ష్మి, హెడ్ నర్స్ మణి కిరణ్ కుమారి, యుజి విజయ, నర్సింగ్ సిబ్బంది టి.గంగాభవాని, జివిఎస్ వరలక్ష్మి, పద్మజలు పద్మావతికి అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలంలో గ్రేడ్ 1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కెజిహెచ్‌లో పనిచేసిన అధికారిని పలు వివాదాల కారణంగా ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే.

సిబిసి యోగా చిత్ర ప్రదర్శనకు స్పందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) విశాఖ సాగరతీరంలో నిర్వహిస్తున్న యోగా చిత్ర ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సహాయ సంచాలకులు షఫి మహమ్మద్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక యోగా విలేజ్ ఆవరణలో ఈ నెల 21 నుంచి 25 వరకూ ఐదు రోజుల పాటు యోగా చిత్రప్రదర్శన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

భారత్ టి-20లోకి విశాఖ కుర్రాడు

నితీష్ కుమార్ రెడ్డి ఎంపికపై పలువురు హర్షం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఇటీవల ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు అందుకున్న విశాఖకు చెందిన నితీష్ కుమార్‌రెడ్డి భారత్ టి - 20 జట్టులోకి ఎంపికయ్యాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మూడేళ్ల వ్యవధిలోనే ఐపిఎల్‌లో స్థానం సంపాదించి సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో నితీష్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జులైలో జరగబోయే జింబాబ్వే పర్యటన కోసం ఆయన్ని భారత్ టి-20 జట్టుకు ఎంపికచేశారు. ఈ మేరకు బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ సోమవారం జట్టును ప్రకటించింది. ఈ సందర్భంగా ఎసిఎ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డితో పాటు ఎసిఎ అపెక్స్ మెంబర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.



నితీష్ కుమార్ రెడ్డి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి -మధురవాడ : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడలో సరైన ట్రాఫిక్ నియంత్రణ అవసరమని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పిఎం.పాలెం ట్రాఫిక్ సిఐ ఎస్.కాంతారావును విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యాన యూనియన్ నాయకులు, కార్యకర్తలు, డ్రైవర్లు పిఎం.పాలెం క్రికెట్ స్టేడియం నుంచి ప్రదర్శనగా వెళ్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో సిఐని కలిసి సమస్యలు వివరించారు. మధురవాడలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండడంతో ఆటో స్టాండ్ల వద్దకు పోలీసులు వచ్చి ఫొటోలు తీసి ఈ చలానాల ద్వారా జరిమానాలు విధిస్తున్నారని, ఈ చర్య సరికాదని పేర్కొన్నారు. కొన్నిచోట్ల అవసరం లేకుండా భారీకేడ్లు పెట్టి ఆటో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మధురవాడలో డి మార్ట్ ఎదురుగా, మధురవాడ వంతెన దగ్గర, కార్ షెడ్ కూడలి, కొమ్మాది సిగ్నల్ పాయింట్, రైతు బజార్‌తో పాటు సర్వీస్ రోడ్లో అనేక చోట్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని తెలియజేశారు. ఆటో కార్మికుల పట్ల ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సానుకూలంగా స్పందించాలని కోరారు. ఆటోలకు పోలీసులు ఇచ్చే గుర్తింపు నెంబర్లు సులభతరం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.చిన్నారావు,



ట్రాఫిక్ సిఐకి ఆటో కార్మికుల సమస్యలు వివరిస్తున్న రాజకుమార్

ఎ.ఎర్రయ్య, ఎం.రాము, అప్పలరాజు, డి.రవి, అబద్ధం, ఎం.రాజు, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని తునివలస పంచాయతీ పరిధిలో ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని ఉన్న మూడు టీ దుకాణాలను పద్మనాభం రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఏడాదిగా ఉపాధి కోసం తాత్కాలికంగా షెడ్డులో ఏర్పాటు చేసుకొని దుకాణాలు నడుపుతున్నామని బాధితులు చెబుతున్నారు. గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కక్షతో తొలగిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకే ఈ తొలగింపులు చేపట్టారని గ్రామంలో చర్చ నడుస్తోంది.

పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడ ప్రభుత్వ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం కోసం వంట సామగ్రిని 8వ వార్డు జనసేన అధ్యక్షుడు శాఖరి శ్రీనుబాబు సోమవారం అందించారు. అవసరమైన వంట సామాగ్రిని అడిగిన వెంటనే సొంత నిధులతో అందించిన శ్రీనుబాబుకు స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ పాఠశాలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నెరవేర్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అనిల్ కుమార్ కొర్రయి, తాటిశెట్టి గణేష్, సత్తి భాస్కర్, ముద్దంశెట్టి శివ, బాలి వెంకటరావు పాల్గొన్నారు.

మత్తు జోలికి పోవద్దు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ చిన్నంనాయుడు విద్యార్థులకు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు నానాజీ, పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

240 మందికి దంత పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల ఆధ్వర్యాన సోమవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. 240 మంది విద్యార్థులకు దంత వైద్యులు ప్రవర్ష, కీర్తన, మనీషా పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సిహెచ్.సింహాచలం పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సతీమణి శారద తన ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ 7 వేలు విలువగల సింటాక్స్ వాటర్ ట్యాంక్‌ను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వి శ్రీనివాసరెడ్డి, నీలాపు శంకరరెడ్డి, టి.శ్రీను చేతుల మీదుగా భవిత కేంద్రానికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శివరాణి, కెజియా కుమారి తదితరులు పాల్గొన్నారు. గంటా శారద హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు శారదకు ఎంఇఒ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ముత్తంశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా వైసిపి కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటానని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు అత్యంత పారదర్శకంగా అమలు చేసినట్లు వివరించారు. 'బటన్ నొక్కి డబ్బులు ఇచ్చారు అన్నారే గానీ తిన్నారు' అన్న అపవాదు ఎక్కడా మూటగట్టుకోలేదని స్పష్టం చేశారు. పార్టీ, వైసిపి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రతి సందర్భంలోనూ నిత్యం ప్రజల్లో ఉన్నానని చెప్పారు. ఇప్పుడే కాదు భవిష్యత్‌లో కూడా నిత్యం ప్రజల్లో ఉంటానని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరందించాలి

డిప్యూటీ ఇంజినీర్ దుర్గాంబ

ప్రజాశక్తి -ఆనందపురం : రానున్నది వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పరీక్షలు జరిపి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ దుర్గాంబ ఆదేశించారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి మండలాల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, అసిస్టెంట్ ఇంజినీర్లకు తాగునీటిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మంచినీటిని అందించాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు నీటి శుభ్రతపై పరీక్షలు జరపాలన్నారు. కెమికల్ పరీక్షలు ఏడాదికి ఒకసారి, క్లోరిన్ పరీక్షలు ప్రతిరోజూ జరిపి నీటి శుభ్రతను గుర్తించాలన్నారు. స్వచ్ఛమైన నీరు లేకపోతే డయేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నాలుగు మండలాల అసిస్టెంట్ ఇంజినీర్లు సుమారు 70 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం, పద్మనాభం, భీమిలి, పెందుర్తి ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు ఎస్‌ఎస్‌ఆర్.మూర్తి, చిరంజీవి, భాస్కరరావు, సుమ పాల్గొన్నారు.



తాగునీటి పరీక్షపై వివరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య సీతామాణిక్యం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆచార్య కె.సీతామాణిక్యం నియమితులయ్యారు. సోమవారం ఆచార్య వి.విజయలక్ష్మి నుంచి బాధ్యతలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా సీతామాణిక్యాన్ని ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు.

స్కేటింగ్ పోటీల్లో శ్రీసాహితి ప్రతిభ



సాధించిన పతకాలతో శ్రీసాహితి

ప్రజాశక్తి -మధురవాడ : పిల్లల్లో ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి తగిన రీతిలో ప్రోత్సహిస్తే వయసుతో సంబంధం లేకుండా విజయాలు సాధించొచ్చని చిన్నారి శ్రీసాహితి నిరూపించింది. చిన్న తనం నుంచే ఆటల్లో ప్రతిభ కనబర్చుతూ పదుల సంఖ్యలో పతకాలు సాధించింది. జివిఎంసి 8వ వార్డు పరిధి ఎండాడకు చెందిన బి.శ్రీసాహితీ నగరంలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. తండ్రి ప్రభాకర్ వ్యాపారస్తుడు. తల్లి మాధురి శైలజ ఆంధ్ర యూనివరిసిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. శ్రీసాహితి చిన్న వయసు నుంచే స్కేటింగ్‌పై ఉత్సాహం చూపేది. దీంతో తల్లిదండ్రులు స్కేటింగ్ శిక్షణ ఇప్పించారు. దేశ, విదేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకుంది. సుమారు 95కి పైగా పతకాలు, జ్ఞాపికలు అందుకుంది. గత ఏడాది ఆగస్టులో ఆస్ట్రేలియాలో జరిగిన పోటీల్లో ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్, ఈ ఏడాది తైవాన్‌లో జరిగిన పోటీలో ఒక బంగారు, రెండు బ్రాంజ్ పతకాలు సాధించింది. శ్రీసాహితిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు.

నేరాలు ఘోరాలు

జెసిబి, లారీ సీజ్

రూ.33 వేలు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం ఎల్‌వి.పాలెం పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీ సర్వేనెంబర్ 207లో సోమవారం అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఒక లారీ, ఒక జెసిబిని మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. జట్లమ్మకొండపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం కోసం గ్రావెల్ తవ్వకాలు జరపడంతో స్థానికులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విఆర్ఒ అప్పలరాజు, విఆర్‌ఎ కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి లారీ, జెసిబిని పట్టుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం మైనింగ్ ఆర్ఐ శైలజ బృందం సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ మైనింగ్ గుర్తించి కొలతలు వేశారు. సుమారు 50 క్యూబిక్ మీటర్లు మట్టిని తీసినట్లు గుర్తించి రూ.33 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, అక్రమంగా మైనింగ్‌కు పాల్పడితే చర్యలు చేపడతాయని హెచ్చరించారు.

లాడ్జీలో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో ఒక ప్రైవేటు లాడ్జిలో సోమవారం ఉదయం రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన చింతకాయల భాగ్యలక్ష్మి అనే వివాహిత మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు...నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన ఆకుల అజయ్‌కుమార్, భాగ్యలక్ష్మిల మధ్య వివాహేతర సంబంధం కొంత కాలంగా కొనసాగుతుంది. భాగ్యలక్ష్మి రాంబిల్లి మండలంలోని బ్రాండిక్స్ కంపెనీలో పని చేస్తుంది. అజయ్‌కుమార్ కూడా కొంతకాలం అదే కంపెనీలో పని చేసేవాడు. అజయ్‌కుమార్ ప్రస్తుతం పెదబొడ్డేపల్లిలో ఉంటున్నాడు. ఇతడిని కలవడానికి తరచుగా భాగ్యలక్ష్మి నర్సీపట్నం వస్తుండేది. ఎప్పటిలాగే ఇద్దరు ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ లాడ్జిలో గడిపారు. ఈ క్రమంలో నగదు, బంగారం కావాలని అజయ్‌కుమార్ డిమాండ్ చేశాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో, మనస్తాపం చెందిన భాగ్యలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఆవరణలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో సోమవారం పిఠాపురం ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యాన పలు, పండ్లు, నీడను ఇచ్చే మొక్కలను నాటారు. పక్షుల ఆహారం నిమిత్తం ధాన్యపు కుచ్చులను కూడా చెట్లకు కట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే క్రమంలో ట్రస్ట్ కార్యకర్తలు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు ముందుగా మొక్క నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎం.సుధాకర్, పలువురు న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి, ట్రస్ట్ కార్యకర్తలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆలయాల పురోహితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రయివేటు అర్చక పురోహితులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఆర్‌బిఎస్.వ్యవస్థాపక అధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య ఆధ్వర్యాన ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళగిరిలో కలిసి అర్చకులు వినతిపత్రం అందించారు. ప్రయివేటు పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగలేటి సతీష్ కుమార్ శర్మ, కార్యదర్శి అధికారుల కాళిదాసు, ఉపాధ్యక్షులు ఈశ్వర ప్రగడ విజయకుమార్ రాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు నేరేళ్ల కామేశ్వర శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. గంభీరం పంచాయతీ సెక్రటరీ కె.చలపతిరావు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి విద్యార్థులందరికీ ఉచితంగా నోటు పుస్తకాలు అందించడానికి ముందుకొచ్చారు. 55 మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యువివి.ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



టిడిపి ముఖ్య కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -కరాస: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారమే ధ్యేయంగా టిడిపి శ్రేణులు పనిచేయాలని పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. జివిఎంసి 52వ వార్డు పరిధి గౌరీనగర్ స్థానిక ఫంక్షన్ హాలులో బూత్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, ముఖ్య నాయకులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ప్రధానంగా 52 వార్డులో ప్రతి బూత్‌లో అధిక మెజార్టీ సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు కూటమిపై విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారన్నారు. వార్డు ప్రజల నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వారి అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో తన విజయానికి కష్టించి పనిచేసిన టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలకు, నాయకులకు పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 52వ వార్డు అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యాముజాల తిరుమల రావు, క్లస్టర్ ఇంచార్జ్ వెంకుమహంతి చంద్రశేఖర్, బిజెపి నాయకులు కాళ్ల అశోక్‌కుమార్, శరత్ చంద్రన్‌బాబు, వివి సూర్యనారాయణ, జనసేన నాయకులు గణేష్ పాల్గొన్నారు.

పిల్లల్లో వికాసానికి అంగన్‌వాడీలు దోహదం

ప్రజాశక్తి-సీతమ్మధార : పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించి, సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు దోహదం చేస్తున్నాయని ఐసిడిఎస్ సిడిపిఒ రమణకుమారి తెలిపారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని జివిఎంసి 47వ వార్డు పరిధి జైప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువును పూర్తి చేసి ఒకటో తరగతికి అర్హత పొందిన పిల్లలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రమణకుమారి మాట్లాడుతూ ప్రతి చిన్నారికీ బాల్యం నుంచే విద్యపై మక్కువ పెంచుకునేలా అంగన్‌వాడీల ప్రణాళికలు ఉండాలని వివరించారు. పిల్లలకు కావలసిన అన్ని సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తుందని, పిల్లలను కేంద్రాలకు విధిగా పంపాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ప్రోత్సహకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జెఎన్‌టి.జ్యోతి, ప్రథమ టీమ్ సభ్యులు హఫిజా, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

సిఐగా విద్యాసాగర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ సిఐగా విద్యాసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాసాగర్ ఇంతవరకు విఆర్‌లో ఉండి బదిలీపై మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, పారిశ్రామిక ప్రాంతంలో గంజాయిని, యువత విచ్చలవిడి ప్రవర్తనను అరికడతామని చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. సమస్యలపై ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు అందించారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల నుంచి భూ సమస్యలపై ఐదు దరఖాస్తులు వచ్చినట్లు పద్మనాభం తహశీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు.

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒకే దరఖాస్తు అందింది. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి దరఖాస్తు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సీతమ్మధార : సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేదికలో నాలుగు వినతులు వచ్చినట్లు తహశీల్దార్ శ్రీరామ్‌మూర్తి తెలిపారు. జోన్- 3 కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు వచ్చినట్లు జోనల్ కమిషనర్ వై.విజయలక్ష్మి తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిన పనులు ప్రారంభించాలని ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కొన్ని విభాగాల్లో కొన్ని నెలలుగా నిలిచిపోయిన పనులను వెంటనే పున: ప్రారంభించాలని, లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఉక్కు అడ్మిన్ భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ, సిఎంఎస్‌లో గత 7 నెలలుగా టెండర్ల ప్రక్రియ పూర్తి కాక బిఎఫ్ఆర్, ఎంహెచ్‌పి, సిఇడిలో రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. దీని వల్ల సుమారు వంద మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మరో వైపు పనులు ప్రారంభం కానందున యంత్రాలు సైతం పాడైపోతున్నా యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికుల పట్ల యాజమాన్యం చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణిని వెంటనే విడనాడాలన్నారు. అన్ని విభాగాల్లో పనులు సక్రమంగా జరిపి యంత్రాలు పాడవకుండా కాపాడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని గుర్తు చేశారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

గిరి ప్రదక్షిణపై ఈవో సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి- సింహాచలం: వచ్చే నెల ఆషాడ పౌర్ణమి రోజున నిర్వహించే గిరి ప్రదక్షిణను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన విధి విధానాలపై సింహాచలం దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాసమూర్తి సోమవారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గిరి ప్రదక్షిణ రోజున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా 32 కిలోమీటర్ల పొడవునా భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, షామియానాలు, కుర్చీల ఏర్పాటు, వైద్య శిబిరాలు, పారిశుధ్యం, పోలీసు భద్రత, జోడిగుళ్లపాలెం బీచ్ వద్ద గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచడం, కొండ చుట్టూ విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టడంపై చర్చించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు పలు సేవలు చేసేందుకు అవకాశం కల్పిస్తామని ఈవో తెలిపారు. మధ్యాహ్నం రథయాత్రతో ఈ గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణ అధికారులు నక్కన ఆనంద్‌కుమార్, రాజేంద్ర కుమార్, రమణమూర్తి, ఇన్‌ఛార్జి ఎఇఇ పి.నర్సింగరావు, పర్యవేక్షకులు పిల్లా శ్రీనివాసరావు, సిరిప్పరకు కనకరాజు, ఈఈ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నాపై వదంతులు నమ్మొద్దు

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజు

ప్రజాశక్తి-పెందుర్తి : తనపై వచ్చిన వదంతులను ఎవరూ నమ్మొద్దని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు కోరారు. అదీప్‌రాజు ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఫుడ్ పాయిజన్ అవ్వడం వల్ల ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో ఆయన స్పందించారు. వీటిని ఖండిస్తూ అదీప్‌రాజు సోమవారం తన స్వగృహం నుంచి ఒక వీడియోను విడుదల చేశారు. అనారోగ్యం కారణంగా వైద్య పరీక్షల నిమిత్తం ఒక ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లానని చెప్పారు. ఆసుపత్రికి వెళ్లడాన్ని కొంతమంది దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తన ఆరోగ్యం బాగానే ఉందని, ప్రజలు, అభిమానులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆదివారం సాయంత్రం కార్యకర్తల సమావేశాన్ని కూడా ఏర్పాటుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలోనే ప్రజల్లోకి వచ్చి వారి సమస్యలు తెలుసుకుని పోరాటాలు చేస్తామని స్పష్టంచేశారు.



విడుదలచేసిన వీడియోలో మాట్లాడుతున్న అదీప్‌రాజు

ఐహెచ్‌ఆర్‌సి విజయనగరం జిల్లా అధ్యక్షులుగా అచ్చిరెడ్డి

ప్రజాశక్తి-వేపగుంట : ఐహెచ్‌ఆర్‌సి విజయనగరం జిల్లా అధ్యక్షులుగా ఎస్.అచ్చిరెడ్డిని నియమిస్తూ గుర్తింపు కార్డును, నియామకపత్రాన్ని విశాఖపట్నం ఐహెచ్‌ఆర్‌సి ప్రధాన కార్యాలయంలో నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఐఎస్ రాజు, పి.మురళి, వై.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, వై.కిషోర్ పాల్గొన్నారు.

'కుల గణన కంటే ముందు నైపుణ్య గణన చేపట్టాలి'

ప్రజాశక్తి-మాధవధార : రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కంటే ముందు నైపుణ్య గణన చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు అవసరమైన గిరాకీని అందుకోవాలంటే మన జనాభాకున్న నైపుణ్యాలను సమర్థంగా అంచనా వేయాలని, వాటిని మెరుగు పరచాలని పేర్కొన్నారు. మొత్తం శ్రామిక శక్తి నైపుణ్యాలు, సామర్థ్యాలను గురించి సమగ్ర సమాచారం సేకరించడం వల్ల విధాన రూపకర్తలు సరైన నిర్ణయాలు తీసుకోవచ్చని వివరించారు.. ఆర్థిక వ్యవస్థలో నైపుణ్యాల పరంగా భవిష్యత్తు అవసరాలు గుర్తించవచ్చని, అభివద్ధి చెందుతున్న మార్కెట్ అవసరాలకు తగిన విధంగా ప్రతి స్పందించే రూపకల్పనకు సహాయపడుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఆస్ట్రేలియా, సింగపూర్, జర్మనీ, కెనడా మొదటి స్థానంలో ఉన్నాయంటే వారు చేపట్టిన నైపుణ్య గణనే కారణమని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సింగపూర్ ప్రస్తుత స్థాయికి చేరుకోవడానికి ఈ కార్యక్రమం కీలకంగా నిలిచిందని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచంలో ఉత్తమ వృత్తి విద్య శిక్షణకు జర్మనీ గొప్ప నమూనాగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచంలో విద్య, నైపుణ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. శ్రామిక శక్తిని, వ్యక్తుల సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి, అభివృద్ధిలో పరుగులు తీయించడానికి నైపుణ్యాలే కీలకమని పేర్కొన్నారు. ఈ నైపుణ్య గణన అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముందుగా దీన్ని చేపట్టాలని కోరారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు కోరారు. భిలాయి స్టీల్‌ప్లాంట్‌లో స్టీల్ మెటల్ అండ్ ఇంజినీరింగ్ ఫెడరేషన్ మీటింగ్ సోమవారం నిర్వహించారు. దీనికి విశాఖ స్టీల్ హెచ్ఎంఎస్ అధ్యక్షులు దొమ్మేటి అప్పారావు హాజరై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం, స్టీల్ యాజమాన్యం కావాలనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని వివరించారు. నూతన వేతనాలు అమలు చేయకుండా, ప్రతినెలా జీతాలు టైం ప్రకారం చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. తక్షణమే మెటల్ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కల్పించుకొని కేంద్ర ఉక్కుమంత్రికి, వైజాగ్ స్టీల్ సిఎమ్‌డికి లెటర్ రాయాలని కోరారు. సెయిల్‌లో ఉన్న అన్ని బెనిఫిట్స్‌ను వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఉక్కు మంత్రికి, వైజాగ్ స్టీల్ యాజమాన్యానికి లెటర్ రాస్తామని, సెయిల్ ప్లాంట్ మాదిరిగా అన్ని బెనిఫిట్స్ కల్పించాలని ఈ మీటింగ్‌లో తీర్మానం చేశారు. అవసరమైతే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు వచ్చి సిఎమ్‌డిని కలిసి మాట్లాడతామని మెటల్ ఫెడరేషన్ ప్రతినిధులు చెప్పినట్లు దొమ్మేటి అప్పారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జెసిఎస్ సభ్యులు రాజేంద్రప్రసాద్‌సింగ్, సచ్చేంద్ర నాయక్, స్టీల్ మెటల్ అండ్ ఇంజినీర్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ త్యాగి, హెచ్ఎస్.మిత్రా, లాల్, సుకాంత్ పాల్గొన్నారు.

గుర్తిస్తే సమాచారమివ్వండి

ప్రజాశక్తి -గాజువాక : ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే వివరాలను తెలియజేయగలరని గాజువాక పోలీసులు సోమవారం ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ నెల 19వ తేదీన గాజువాక ఆర్‌టిసి డిపో నుంచి గాజువాక వస్తున్న వ్యక్తిని కారు ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన గుర్తు తెలియని వ్యక్తిని పోలీసులు కెజిహెచ్‌కు తరలించారు. అతను స్పృహలోకి రాకపోవడం వివరాలు తెలియలేదని, ఆయన ఎత్తు 5.7 అడుగులు, చామన చాయ రంగు, 25 నుంచి 30 మధ్య వయసు ఉంటుందని పేర్కొన్నారు. ఈ వ్యకిని ఎవరైనా గుర్తిస్తే గాజువాక పోలీసులను సంప్రదించాలని కోరారు.



చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

నీట్‌లో అక్రమాలపై సిపిఎం నిరసన

కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-చోడవరం

దేశంలోని యుజి వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) నిర్వహించిన నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై సిపిఎం నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు నీట్ పరీక్షలను రద్దు చేయాలని, కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ నీట్ ఎంట్రన్స్ పరీక్షకు 25 లక్షల మంది విద్యార్థులు అహర్నిశలు కష్టపడి పరీక్షలు రాశారని తెలిపారు. ప్రజలకు వైద్యం అందించే ఉద్దేశంతో ఎంతో మంది కోటి ఆశలతో డాక్టరు కావాలని కలలు కంటారని, అటువంటి ఉన్నతమైన వైద్య విద్యలో ప్రవేశాలకు అక్రమ మార్గాల్లో పేపర్లు కొనుగోలు చేసి డాక్టర్లు అయితే వైద్య వ్యవస్థ నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగితే విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేశారని గుర్తు చేశారు. నీట్ పరీక్షతో పాటు నెట్ పరీక్ష పేపర్ కూడా లీకేజ్ అయిందని, కనీసం పరీక్షలు నిర్వహించడం కేంద్ర ప్రభుత్వానికి చేతకావడం లేదని విమర్శించారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం మెడికల్ ఎంట్రన్స్ టెస్టులు నిర్వహించుకునేవని, కేంద్ర బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రాల మెడికల్ ఎంట్రన్స్ టెస్టులు రద్దు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాసిందని, కేంద్రం గుప్పెట్లో రాష్ట్రాల హక్కులని పెట్టుకుంటుందని. దీనివలన మన రాష్ట్ర విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని. కావున మెడికల్ ఎంట్రన్స్ రాష్ట్రాల పరిధిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకర్రావు, నాయకులు జి వరలక్ష్మి, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కొణతాల

ఎమ్మెల్యే కొణతాల సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సోమవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. అనకాపల్లి పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. తక్షణం యార్డ్‌ను ఇక్కడ నుండి తరలించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. పెరుగు బజార్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డును పరిశీలించారు. తక్షణం రోడ్డును నిర్మించాలని, దానికి కావాల్సిన నిధులను సమకూరుస్తామని చెప్పారు. భవనాలు పోయిన బాధితులకు తక్షణం టిడిఆర్స్ ఇవ్వాలని, దానికి కావలసిన ఏర్పాట్లు పరిశీలించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అక్కడ నుండే జీవిఎంసీ కమిషనర్‌తో ఫోన్లో సంప్రదించి ఈ సమస్యలపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. 2004లో తాను మంత్రిగా ఉన్నప్పుడు నిర్మాణం చేసిన కాలువల లైనింగ్ పనులను పరిశీలించి వాటిని సిల్టు తీయించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రైతుల సాగునీరుకి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పట్టణంలోని మురికి కాలువల్లో ముందుగానే పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థ పదార్థాలను తొలగించాలని కోరారు. అనకాపల్లి-విజయనగరం రోడ్డులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, అక్కడున్న రైల్వే బ్రిడ్జి రిపేర్లు చేయించి మట్టి చెత్త చెదారం తొలగించాలని ఆదేశించారు. పట్టణంలో రోడ్ల నిర్మాణం, మంచినీటి ఇబ్బందులు, శానిటేషన్‌పై పలు సూచనలు చేశారు.




ఎస్‌పికి స్టాపర్ బోర్డులు అందిస్తున్న రామ్‌కో కంపెనీ ప్రతినిధులు

రామ్‌కో సిమెంట్ సిఎస్ఆర్ నిధులతో స్టాపర్ బోర్డులు

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అనకాపల్లి జిల్లా పోలీసులకు రామ్‌కో సిమెంట్ కంపెనీ యాజమాన్యం తన సిఎస్ఆర్ నిధులు సుమారు రూ.9 లక్షలతో స్టాపర్ బోర్డులను జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణకు సోమవారం అందజేసింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాంకో కంపెనీ యాజమాన్యం 125 స్టాపర్ బోర్డులను అందజేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో నేషనల్ హైవే, స్టేట్ హైవేలలో రోడ్డు ప్రమాదాలు తరచూ సంభవించే (బ్లాక్ స్పాట్స్) వద్ద స్టాపర్ బోర్డులను ఏర్పాటు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు, రాంకో సిమెంట్స్ ప్లాంట్ యూనిట్ హెడ్ పి.వీరపాండ్యన్, అడ్మిన్ హెడ్ ఎం.శశిధర్‌రావు, హెచ్ఆర్ ఎం.యువరాజు, అనకాపల్లి సిఐ పైడపు నాయుడు, రూరల్ సీఐ ధనుంజయరావు, కసింకోట సిఐ వినోద్ బాబు, అనకాపల్లి రూరల్ ఎస్సై తేజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులపై ఎస్ఎఫ్ఐ ధర్నా



ఎన్‌డిసికి సమస్యలను తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌డిఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి, ఎన్డీసీ రమామణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ సెక్రటరీ ఎస్ రమణ మాట్లాడుతూ ప్రస్తుతం అనకాపల్లి డివిజన్లో 50 ప్రైవేటు పాఠశాలలో నడుపుతున్నారని, అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు తెలిసేలాగా ఫీజుల వివరాలను నోటీసు బోర్డుల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాల అమ్మకాలు విచ్చలవిడిగా చేస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా స్కూలు నడుపుతున్న యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎన్డిసి రామామణి మాట్లాడుతూ వెంటనే విద్యాశాఖ అధికారులు తెలియజేసి, చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ ఎం రమేష్, నాయకులు ప్రవీణ్, సాయి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీలో సోమవారం రైతులకు వరి విత్తనాలు ఏఈఓ విజయ్, టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో రైతులకు మంచి జరిగే విధంగా పరిపాలన సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ తుమ్మపాల ఇందిరా నగరలో గ్రామపంచాయతీ నిధుల నుండి సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు పనులు ఎలక్షన్ కోడ్ రావడం వలన జాప్యం జరిగిందన్నారు. సుమారుగా రెండు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పిళ్లా గాంధీ, ఎంపీటీసీ సభ్యులు వడ్డాది భారతి అశోక్, పస్పిరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్లు ముత్యాల వెంకటలక్ష్మి, గోవిందమ్మ, తట్ట సత్యారావు, అండిబోయిన నాగరాజు, దళిత నాయకులు బంగారు వెంకటేశ్వరరావు, స్థానిక కూటమి నాయకులు డాక్టర్ ముత్యాల అప్పారావు, కందిపూడి జగ్గారావు పాల్గొన్నారు.

మంత్రి కొల్లి రవీంద్రను కలిసిన నీలబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర మంత్రి కొల్లి రవీంద్రను మంగళగిరి కేంద్ర కార్యాలయంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీలబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బీసీలు ఆర్థికంగా బలపడే విధంగా ప్రభుత్వ పరంగా అనేకమైన సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు.

సందడిగా 'పబ్లిక్ గ్రీవెన్స్' ప్రారంభం



సమస్యలు వింటున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) సందడిగా ప్రారంభమైంది. తొలి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని, ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి, ఇతర అధికారులు ప్రజల వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 22 ఫిర్యాదులు

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 22 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ నేరుగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఎస్సై టి.దివ్య పాల్గొన్నారు.

ఇనాం భూముల సాగు రైతులకు రైత్వారీ పట్టాలు ఇవ్వాలని..

అనకాపల్లి జిల్లా చౌడువాడ గ్రామ ఇనాం భూముల సాగు రైతులకు రైతు వారీ పట్టాలు ఇవ్వాలని కోరుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్, జిల్లా కమిటీ సభ్యులు కుమార వెంకటరమణ మాట్లాడుతూ కె.కోటపాడు మండలం చౌడువాడ, పాచిలివానిపాలెం, గరుగుబిల్లి గ్రామాల్లో సుమారు 270 ఎకరాలకు పైగా ఇనాం భూముల్లో మూడు తరాలకు పైగా రైతులు సాగు చేస్తున్నా, నేటికీ వాటిపై హక్కులు కల్పించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఇనాం భూములు సాగు చేస్తున్న 66 మంది రైతులకు రైత్వారీ పట్టాలివ్వాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు.



అర్జీ స్వీకరిస్తున్న కె.కోటపాడు తహశీల్దారు ఈశ్వరమ్మ

కె.కోటపాడులో పలు ఫిర్యాదులు

కె.కోటపాడు : కె.కోటపాడు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ స్వీకరించారు. మండలంలో గొట్లాం, సూదివలస గ్రామాలనుంచి పట్టాదార్ పాస్ బుక్, రోడ్ సౌకర్యం కోరుతూ వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిటి డి.రమేష్ బాబు, రీసర్వే డీటీ సూరి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.జానకి, మండల సర్వేయర్ కె.రామచంద్రమూర్తి, విఆర్ఓలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో గంటి సాగు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : కొద్దిరోజులుగా ఆడపా దడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. పలు గ్రామాల్లో రైతులు గంటి నాట్లు వేస్తున్నారు. మండలంలోని కందిపూడి, పెద్దమదీన, రాజాం తదితర గ్రామాలలో మెట్ట పంట సాగులో భాగంగా గంట సాగు చేస్తున్నారు.



గంటి నాట్లు వేస్తున్న రైతులు



పుస్తకాలు అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం ప్రాథమికోన్నత పాఠశాల-3లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, బూట్లును సోమవారం ప్రధానోపాధ్యాయలు శ్రీదేవి ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గల్లా రాజు, టీడీపి నాయకులు ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణరావు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఘనంగా పీలా మహాలక్ష్మి నాయుడు వర్థంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తండ్రి పీలా మహాలక్ష్మి నాయుడు 14వ వర్థంతి సందర్భంగా సోమవారం అనకాపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి నుండి పీలా మహాలక్ష్మి నాయుడు తెలుగుదేశం పార్టీకి సేవలు అందించి, సమితి అధ్యక్షునిగా, ఎంపీపీగా పలు పదవుల అలంకరించి, క్రమశిక్షణ గల నాయకుడిగా ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఆయన వారసులు పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లి ఎమ్మెల్యేగా ప్రజల్లో మంచి పేరు పొందారని, రెండో కుమారుడు పీలా శ్రీనివాసరావు రాష్ట్ర నాయకుడిగా మంచి గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొణతాల నూక నాయుడు, సందిన సునీల్, నడిపల్లి బోసుబాబు, కాండ్రేగుల చిన్న, వేగి కృష్ణ, పైలా గోపి, ఆళ్ల జగదీ, అర్జున్, బోస్, వేదుళ్ళ సూర్యప్రభ, జామిరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వేగి వీధిలో కరెంటు సమస్యలపై గవరపాలెం కరెంట్ ఆఫీస్ కార్యాలయంలో ఏఈ కె.రాజేంద్రప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జివిఎంసి 81వ డివిజన్ టిడిపి ఇంచార్జ్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ వేగి వీధి, చిన్న హైస్కూల్లో ట్రాన్స్‌ఫార్మర్ నెంబర్ 365లో లోడ్ సరిపడనందున రెండు మాసాల నుండి విపరీతమైన కరెంటు సప్లై సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గంట గంటకు కరెంటు సమస్యలు ఉండడం వల్ల చదువుకునే విద్యార్థులకు, నీరు పెట్టుకునే మహిళలకు, వ్యాపారస్తులందరికీ ఇబ్బంది కలుగుతుందని పేర్కొన్నారు. తక్షణమే స్పందించి సదురు ట్రాన్స్‌ఫార్మర్ అప్ గ్రేడ్ చేసి సమస్యని పరిష్కరిస్తారని కోరారు. దీనికి స్పందించిన ఏఈ రాజేంద్రప్రసాద్ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేగి లక్ష్మి, వేగి సూరిబాబు, వేగి కృష్ణ, ఆడారి సూరి అప్పారావు, కర్రి మహాలక్ష్మి నాయుడు, అధిక స్థాయిలో వేగివీధి మహిళలు పాల్గొన్నారు.

ఇరువాడ పాల సొసైటీ అధ్యక్షునిగా మామిడి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ విశాఖ డెయిరీ పాల సొసైటీ అధ్యక్షుడుగా మామిడి బంగారునాయడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఉదయం పాల సొసైటీ కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి పాల సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు సండ్రాన అప్పారావు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో మామిడి బంగారునాయుడు నూతన అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బంగారునాయుడు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పెదనాయుడుపాలెం పాలసొసైటీ ప్రెసిడెంట్ సబ్బవరపు సత్యనారాయణ, అమృతపురం వైసిపి నాయకులు చీపురుబిల్లి సూర్యనారాయణ, ఇరువాడ గ్రామ పెద్దలు మచ్చ కోటేశ్వరరావు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్షుడిని అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

పంచాయతీ కార్మికుల ఆందోళన తాత్కాలిక విరమణ

బకాయి జీతాలు చెల్లింపునకు హామీతో విధుల్లోకి..

ప్రజాశక్తి - కశింకోట

తమకు ఐదు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని కోరుతూ విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్న కశింకోట మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, అధికార పార్టీ నాయకులు, అధికారుల హామీతో ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. కశింకోట పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఈ నెల 21 నుండి ఆందోళనబాట పట్టిన విషయం విధితమే. 22వ తేదీన పంచాయతీ కార్యదర్శితో జరిగిన చర్చలు విఫలం కావడం, మూడో రోజు ఆదివారం చేపట్టిన ఆందోళనకు అధికారులెవరూ స్పందించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నాలుగో రోజు సోమవారం కలెక్టర్, డిపిఒ, స్థానిక ఎమ్మెల్యే తదితరులకు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వడానికి కార్మికులు అనకాపల్లి బయలుదేరారు. ఈ సమయంలో అధికార పార్టీ నాయకులు వచ్చి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుని తాము పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి, అధికార పార్టీ నాయకులు, సిఐటియు, పంచాయతీ కార్మిక నాయకులు సమస్యలపై చర్చించారు. చివరకు పంచాయతీ కార్మికులకు చెల్లించవలసిన ఐదు నెలల బకాయి వేతనాల (ప్రస్తుతం ఆరవ నెల నడుస్తుంది)కు సంబంధించి రెండు నెలల బకాయి వేతనాలు (జనవరి, ఫిబ్రవరి) ఈ నెల 27న గురువారం, మూడో నెల (మార్చి) వేతనం జులై 3న మిగిలిన వేతనాలు మరో రెండు వారాల్లో పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కశింకోట జనాభా సుమారు 30 వేలు మంది ఉన్నారని, పంచాయతీ విస్తీర్ణం కూడా ఎక్కువగా ఉందని, దీనికి తగినట్లుగా కార్మికులను పెంచాలని కోరారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టామని, మంజూరైన వెంటనే సిబ్బందిని పెంచుతామని ఈవో ఎన్. రమేష్ హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు తమ ఆందోళనను తాత్కాలికంగా నిలుపుదల చేసి విధులకు హాజరయ్యారు. సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోతే ఏ రోజు నుండైనా మళ్లీ సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.రామాజీ, జి.వెంకటరమణ, కోశాధికారి కె.దేవుడు, కొండబాబు, రాణి, ఆదిలక్ష్మి, అర్జునమ్మ, రాములు, నాగేశ్వరరావు, ఓ.అప్పారావు, లక్ష్మణ రాము తదితర పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి రమేష్‌తో చర్చించిన సిఐటియు, పారిశుధ్య కార్మిక నాయకులు

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ప్రజాశక్తి -అచ్యుతాపురం

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ వ్యాపారస్తులకు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో సోమవారం ఎస్కేఆర్ ఫంక్షన్ హాల్లో పరిసరాల పరిశుభ్రతపై గ్రామ సచివాలయాల కార్యదర్శులు, వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారాలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అచ్యుతాపురం మండల కేంద్రంలో సుందరంగా తీర్చిదిద్దే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. వ్యర్థ పదార్థాలు చెత్త కాగితాలు ప్లాస్టిక్ సంచులు రహదారులపై పడేయ రాదని సూచించారు. అచ్చుతాపురం మహానగరంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అవసరమన్నారు. ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సురేష్ కుమార్, ఎస్ఐ నారాయణరావు, తహశీల్దార్ రజిని, మాజీ జడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు బి రామదాసు, గ్రామ సచివాలయ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా అచ్చుతాపురం

అచ్యుతాపురం : అచ్చుతాపురాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్చుతాపురం హైస్కూల్లో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాల బాలికలు చదువు పట్ల దృష్టి సారించాలన్నారు. చదువులో రాణించిన వారికి సమాజంలో గుర్తింపుతో పాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, మండల విద్యాశాఖ అధికారి సీఆర్కే దేవరాయలు, ద్వారపు రెడ్డి బాబ్జి, రామన్నపాలెం గ్రామ సర్పంచ్ డి నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల సంఘటనపై ప్రభుత్వ చర్యల పట్ల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : బాపట్ల జిల్లా చీరాలలో మహిళపై అత్యాచారం, హత్య కేసు నిందితులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో 48 గంటల్లో పోలీసులు అరెస్టు చేయడం పట్ల తెలుగు మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి సుకల రమణమ్మ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఘటనా ప్రాంతానికి హోం మంత్రి అనిత స్వయంగా వెళ్లి బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారని తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి మాట్లాడుతూ నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం ఉంటే నేరాలను కట్టడి చెయ్యవచ్చని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి, వైసిపి మూకలకు ప్రభుత్వం సహకారం ఉండటం వల్లే దారుణమైన సంఘటనలు జరిగాయని ఆరోపించారు. సమావేశంలో తెలుగు మహిళా నాయకులు రాజాన నారాయణమ్మ, వేదుల సూర్యప్రభ, రేబాక మాలతి, లాలం శాంతి, భీశెట్టి హేమ, కోలాట ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : కొలపర్తి ఫ్రీ యోగా మెడిటేషన్ ఆధ్వర్యాన అనకాపల్లిలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న ధ్యావజన్నీ ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ మేరకు సదరు విద్యార్థిని సోమవారం ప్రిన్సిపాల్ రూపానంద, అకాడమీ ఇన్‌చార్జ్ చంద్రమౌళి అభినందించారు.



చిన్నారిని అభినందిస్తున్న దృశ్యం

మెగా డిఎస్‌సిలో ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-చోడవరం : మెగా డీఎస్సీలో 6,800 ప్రత్యేక ఉపాధ్యాయుల (వికలాంగుల) పోస్టులను భర్తీ చేయాలని నూతన ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ జగతా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేసి మాట నెలబెట్టుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే ప్రత్యేక ఉపాధ్యాయులు సంగతి మరిచిపోయిందని పేర్కొన్నారు. వికలాంగుల కోటలో 6800 పోస్టులను భర్తీ చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరాలోచించాలని కోరారు. 2019లో టిడిపి ప్రభుత్వంలో ప్రత్యేక ఉపాధ్యాయుల 600 మంది ఉద్యోగాలు పొందారని, 2024 మెగా డీఎస్సీలో వీరి పోస్టులు భర్తీ చేయకపోవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.

గురుకులంలో మిగులు సీట్లు భర్తీకి 28న రాతపరీక్ష

ప్రజాశక్తి-దేవరాపల్లి : తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకులంలో 2024- 2025 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి ఈనెల 28న రాత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.రవీంద్రనాథ్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలు వరకు అర్హులైన బాలుర నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు ఫారం ఆధార్ కార్డు, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్ జత చేసి ఇవ్వాలన్నారు. ఈ నెల 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 గంటలకే హాజరుకావాలని కోరారు. తమ వెంట ఆధార్ కార్డు జిరాక్స్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను తీసుకుని రావాలని సూచించారు.

ఆరోగ్య మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా గోవింద

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆరోగ్య మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన చవ్వాకుల గోవింద ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటియుసి అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఆరోగ్య మిత్ర ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభ జరిగిందని, వివిధ జిల్లాలకు చెందిన యూనియన్ ప్రతినిధులు పాల్గొని రాష్ట్ర అధ్యక్షునిగా సిహెచ్ గోవిందతో పాటు ప్రధాన కార్యదర్శిగా గురవయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా దేవేంద్ర నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లూరి బంగారు, కార్యదర్శులుగా సుధీర్, శేఖర్, ప్రభావతి, కృష్ణ, మూర్తి, కోశాధికారిగా రామ్మోహన్, మరి కొంతమంది కార్యవర్గ సభ్యులను ఎన్నికున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆరోగ్య మిత్రలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై పరిష్కారం కోసం, రోగులకు నాణ్యమైన, న్యాయమైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని నూతన కమిటీకి భద్రం విజ్ఞప్తి చేశారు.

పలుచోట్ల వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని దొండాడ గ్రామంలో సోమవారం కూటమి నాయకులు రాయితీపై వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ మాట్లాడుతూ, మండలంలో సాధారణ సాగు 4567 ఎకరాలు ఉండగా, ఇందులో 4400 ఎకరాల్లో రైతులు వరి వేస్తారని తెలిపారు.సుమారుగా 780 క్వింటాళ్ల వరి విత్తనాలను ఇండెంట్ పెట్టామన్నారు. వరి విత్తనాలను మొలక శాతం కట్టి 80 శాతం పైన వుంటేనే రైతులకు ఇవ్వమని వ్యవసాయ సిబ్బందికి సూచించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెందిన కొండలరావు, టీడీపీ పార్టీ అధ్యక్షులు కొప్పి శెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, కోసూరి శ్రీనివాసరావు, వెలగా సుధాకర్, మాణిక్యం, బుజ్జి, దివాణం, దేవర సత్యనారాయణ, గింజాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల:రైతుల సంక్షేమమే లక్ష్యమని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల అధ్యక్షులు జానకి శ్రీను అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని ఆధ్వర్యంలో రైతులకు రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 765.85 క్వింటాళ్ల ఏడు రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉంచామని, కిలో పది రూపాయలు సబ్సిడీపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు వేచలపు జనార్ధన్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, మండల టిడిపి కార్యదర్శి లింగన్న నాయుడు పాల్గొన్నారు.



కోటవురట్లలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం, మాజీ సర్పంచ్

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (1) విద్యార్థులకు పాలూరు బాబూరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పాలూరు రాజేష్ పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ బుక్స్, కాపీ పుస్తకాలు, పెన్సిల్, ఎరేజర్ బాక్స్‌లను సోమవారం విద్యార్థులకు అందజేశారు. పుస్తకాలు, తదితర స్టేషనరీని విద్యార్థులకు అందజేయడంపై ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలగా శ్రీనివాసరావు, హెచ్ఎం, గ్రంథాలయ అధికారి, ఉపాధ్యాయులు పాలూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలతో వెట్టిచాకిరీకి పాల్పడిన

వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

- సిఐటియు డివిజన్ కార్యదర్శి దేముడునాయుడు

ప్రజాశక్తి-చీడికాడ :ఆశా కార్యకర్తలతో ఆసుపత్రిలో వెట్టిచాకిరి చేయించిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని సిఐటియు కార్యదర్శి ఆర్.దేముడు నాయుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చీడికాడ మండలంలో పెద్ద గోగాడ పీహెచ్‌సి పరిధిలో చుక్కపల్లి ఆశా వర్కర్లతో గ్రామ సచివాలయాలు, సబ్ సెంటర్లో పారిశుధ్య పనులు చేయించడం చాలా బాధాకరమన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి పారిశుధ్య పనులు చేయించడం సబబు కాదన్నారు. గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, అయినప్పటికీ అధికారులు ఆశా కార్యకర్తలను బెదిరించి భయ భ్రాంతులకు గురిచేసి సబ్ సెంటర్లు, సచివాలయాల్లో తుడిపించడం, వాటిని కడిగించడం, కుర్చీలు బెంచీలు మోయించడం వంటి పనులు చేయించడం అన్యాయమన్నారు. జిల్లా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శారదా పీఠానికి కేటాయించిన

భూములను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా భీమిలి మండలం కొత్తవలసలో శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాల భూములను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని విదసం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన నిరసన తెలిపారు. భూముల విషయమై ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఈతలపాక సుజాత, సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, బొడపాటి శామ్యూల్ కుమార్, కస్తూరి వెంకటరావు, కె.రవిశేఖర్, అఖిల్, బండారు రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలపై గ్రామ రెవెన్యూ సహాయకులు దృష్టి సారించాలని తహసిల్దార్ వెంకటరమణ సూచించారు. సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసేందుకు వచ్చిన సందర్భంగా వారికి సూచించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో తహసిల్దార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో అనధికారికంగా అనుమతి లేకుండా గ్రావెల్, ఇసుక, మట్టి వంటివి అక్రమంగా రవాణా కాకుండా గ్రామీణ ప్రాంతాలలో అందుబాటులో ఉండాలన్నారు. ఇంతవరకు ప్రతినిత్యం ఇద్దరు వీఆర్ఏలు కార్యాలయంలో అందుబాటులో ఉండే వారిని, ఇకపై మండల కార్యాలయానికి రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూ సమస్యలు తెలుసుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో చినపాచిల గ్రామంలో సర్పంచి కోమటి రామలక్ష్మి శంకర్రావు ఆధ్వర్యంలో సోమవారం ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ గ్రామానికి సుమారు మూడు ఏళ్ల క్రితం నుంచి వీఆర్పీ లేని కారణంగా ఈ ఏడాది నేటి వరకు పనులకు నోచుకోలేదు. ఇటీవల ఆ గ్రామానికి వీఆర్పీగా ప్రసాద్‌ను నియమించడంతో పనులను ప్రారంభించారు. దీంతో గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గంగాభవాని, పాల సొసైటీ అధ్యక్షుడు ఆధాడ రాజారావు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ఆక్రమణలపై రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు పంచాయతీ రెవెన్యూ పరిధి పరగణం చెరువు, దీనికి సంబంధించిన గెడ్డలు, కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని వాటిని తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం పలువురు రైతులు తహసీల్దార్ శ్రీకాంత్ కు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. చెరువు, గెడ్డలు, కాలువలు ఆక్రమణకు గురి కావడంతో సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం అవుతున్నామని, చెరువు, గెడ్డలు, కాలువల ఆక్రమణకు గురి కావడంతో సాగునీరు అందలేదని, దీంతో సాగు నీటి కోసం నానాపాట్లు పడవలసి వస్తుందని రైతులు తెలిపారు.వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తూము వెంకటరావు, అప్పారావు, కొండయ్య, వెంకట కుమార్, బాబ్జి, చిట్టి రామారావు, దాడి అప్పారావు, సూర్య చంద్ర, చిన్న దొర తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు పత్రాన్ని ఇస్తున్న రైతులు

స్కూలు ఆటోలపై కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిబంధనలను ఉల్లంఘించిన రెండు స్కూలు ఆటోలపై తాజాగా కేసులు నమోదు చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజరత్నం మీడియాకు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు మాధవి, సుమన్ కుమార్, తదితరులు పాల్గొన్నట్టు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పద్మావతి

ఆరోగ్యం, పోషణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘం ఆరోగ్య సబ్ కమిటీ సభ్యులకు ఆహారం, పోషణ, ఆరోగ్యం, పారిశుద్ధ్యం పై మూడు రోజులు పాటు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఏపీఎం పద్మావతి మాట్లాడారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న పథకాలు, మహిళల్లో ఏర్పడే రక్తహీనత, తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఏపీఎంలు శ్రీనివాసరావు, రాజాబాబు, ఉషాదేవి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూటమి నాయకులు

సెంట్రల్ లైటింగ్‌ను త్వరగా ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి జాతీయ రహదారిపై త్వరిత గతిన సెంట్రింగ్ లైటింగ్ ఏర్పాటును పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, బిజెపి మండల శాఖ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు కోరారు. కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ లైటింగ్ మంజూరు చేసిందన్నారు. నేషనల్ హైవే అధికారులు ఆలస్యం చేయకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త శ్రీను, అల్లాడ రాము, నడిగట్ల అప్పన్న, రమేష్, రాజారావు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్:రావికమతం మరుపాక ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే.సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 7,8,9, తరగతుల మిగులు సీట్ల భర్తీకి ఈనెల 25, 26, 27 తేదీలలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. స్టడీ, ఫోటో, ఆధార్ జిరాక్స్ కాపీలను తమ కార్యాలయానికి అందజేయాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 29న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.



బురదమయంగా ఉన్న రోడ్డు

రహదారి నిర్మించరూ..

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని వెంకటాపురం గ్రామం మీదుగా సాలికమల్లవరం గ్రామం వరకు రోడ్డు సదుపాయం లేదు. దీంతో, అటుగా వెళుతున్న ప్రయాణికులు, వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే బురదమయంగా మారడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాదచారులు, వాహనదారులు వాపోతున్నారు. తక్షణమే రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కార్మికులకు నష్టం చేకూర్చే అగ్రిమెంట్

-షిప్‌యార్డు క్యాంటీన్‌లో మీల్స్ అలవెన్స్ ఒప్పందంపై కార్మికుల కన్నెర్ర
-యాజమాన్యంతో ఐఎన్‌టియుసి కుమ్మక్కు : సిఐటియు విమర్శ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రతిష్టాత్మకమైన హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ సంస్థలో తాజాగా జరిగిన మీల్స్ అలవెన్సు అగ్రిమెంట్‌పై అక్కడి ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. షిప్‌యార్డులో ఇటీవల గుర్తింపు సంఘం ఐఎన్‌టియుసి యాజమాన్యంతో కుమ్మక్కయి చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం క్యాంటీన్‌లో భోజనం రూ.100కు చేరడంతో పలువురు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. మొత్తం ఖర్చు కార్మికుడే భరించేలాగ ఈ అగ్రిమెంట్ చేయడాన్ని సిఐటియు షిప్‌యార్డు యూనియన్ అధ్యక్షులు బిఎస్ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తప్పుపట్టారు. యాజమాన్యానికి తమ నిరసనను త్వరలో తెలియజేస్తామని హెచ్చరించారు.

వాస్తవానికి విశాఖ ప్రభుత్వ రంగ సంస్థల్లోగల క్యాంటీన్‌లలో కార్మికులు, ఉద్యోగ సిబ్బంది యావన్మందికీ శుచికరమైన భోజనం, టీ, టిఫిన్‌లు అందించే సదుపాయం గతంలో పుష్కలంగా ఉండేది. ప్రస్తుతం వైజాగ్ పోర్టు, షిప్‌యార్డు, స్టీల్‌ప్లాంట్, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్, ఎల్ఐసి వంటి పలు కేంద్ర సంస్థల్లో ఇది కొనసాగుతున్నప్పటికీ ఇదివరకటి పద్ధతుల్లో జరగనందున ఆయా ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ముఖ్యంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరి మెనూ అమలు, శుచికరమైన వంటకాలకు ఈ క్యాంటీన్‌లు దూరం అయ్యాయన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట.

షిప్‌యార్డులో ఏం జరిగింది ?

2014లో సిఐటియు గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడు మీల్స్ అలవెన్స్‌ను కార్మికులకు, సిబ్బందికి పెంపుదల చేయడమే కాకుండా ఎరియర్స్ ఇప్పించి మూడేళ్లకు అగ్రిమెంట్ చేసి క్యాంటీన్‌లో సబ్సిడీ భోజనం అమలు జరిగేలా ఒప్పందం జరిగింది. ప్రస్తుతం ఐఎన్‌టియుసి యాజమాన్యంతో కలిసిపోయి భోజనాన్ని ఏకంగా రూ.58 నుంచి రూ.100కు పెంచేసింది. 2017 నుంచి ఏడేళ్ల ఎరియర్స్ లేకుండా, టైం పీరియడ్ లేకుండా అగ్రిమెంట్ చేసుకుంది. ఆ తీరుపై సిఐటియు నేతలు మండిపడుతున్నారు. దీన్ని పున:సమీక్ష చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని యాజమాన్యానికి ఇవ్వను న్నామని, అన్యాయమైన ఈ అగ్రిమెంట్‌పై స్పందించక పోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్రం తక్షణం నిలుపుదల చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 1180వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎఫ్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, వర్కింగ్ కేపిటల్ సమకూర్చాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న మార్కెట్‌యార్డులను లీజుకు ఇవ్వడంగానీ, అమ్మడంగానీ చేయరాదన్నారు. స్టీల్‌ప్లాంట్ భూములను పరిరక్షించాలని కోరారు. గంగవరం పోర్టును గత జగన్ ప్రభుత్వం చట్ట విరుద్ధంగా అదానీకి అప్పగిస్తూ ఒప్పందం చేసుకుందని తెలిపారు. దాన్ని రద్దు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఉక్కు నిర్వాసితులకు తక్షణమే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.మల్లయ్య, సీనియర్ నాయకులు వై.కొండయ్య, జిల్లా కమిటీ సభ్యులు భూషణం పాల్గొన్నారు.

అమర్‌నాథ్ నిర్మాణాలకు నోటీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్-5 పరిధి 70వ వార్డు గాజువాక చిట్టివానిపాలెం జాతీయ రహదారికి ఆనుకుని ఎలాంటి అనుమతులూ పొందకుండా మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్మాణాలు చేపట్టారంటూ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. 374 స్క్వేర్ మీటర్ల స్థలంలో జి ప్లస్ 4 భవనాన్ని నిర్మించారని, అందులో అడుగడుగునా ఉల్లంఘనలు ఉన్నాయని సదరు నోటీసులో పేర్కొన్నారు. వారం రోజుల్లో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని వాటిలో తెలిపారు. అమర్‌నాథ్ అక్రమ నిర్మాణాలపై జివిఎంసి 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం ఉదయం జివిఎంసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

జగన్నాథ స్వామి రథోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెయిన్ రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో వచ్చే నెల 6 నుండి 18 వరకు జరిగే శ్రీ జగన్నాథస్వామి వారి రథోత్సవాల పోస్టర్‌ను దక్షిణ ఎమ్మెల్యే చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. సోమవారం ఆయన దేవస్థానాన్ని సందర్శించి శ్రీ జగన్నాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో ఇఒ రాజగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు, యేడిద సురేష్, 36వ వార్డు జనసేన అధ్యక్షులు శ్రీనివాస్, కేదారి లక్ష్మి, మజ్జి త్రినాథ్, గోడి నరసింహాచారి, కొనాడ చిన్నా పాల్గొన్నారు.

పనిచేయని చేతి బోరు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం వెంకన్నపాలెంలో 49/1 నెంబర్ చేతి బోరు పంపు పనిచేయడంలేదు. బోర్లు పడడమే గగనమైన ఈ ప్రాంతంలో ఉన్న అరకొర చేతి పంపుల నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వెంకన్నపాలెం ప్రాంతంలో తరచూ నీటి సమస్య ఉంటుంది. కుళాయిల నీరు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటారు. కుళాయిల ద్వారా అందించే నీటికి తరచూ అంతరాయం కలుగుతుంది. ఆ సమయంలో ఈ ప్రాంతంలోని సుమారు 50 ఇళ్లకు ఈ బోరు బావి ఆధారంగా ఉంది. నెలల తరబడి పనిచేయకపోయినా, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథులే కనిపించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్ములు చేపట్టాలని కోరుతున్నారు.



పనిచేయని బోరు

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రెసిడెంట్ జీ.గీతాకృష్ణ మాట్లాడుతూ, నర్సీపట్నంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సుమారు 20 పైగా ఉన్నాయన్నారు. వీటిలో సరైన సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తుండటంతో మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ర్యాంకులు వచ్చినప్పుడు విద్యాసంస్థల యాజమాన్యాలు ఫ్లెక్సీలు పెడుతున్నారని, ఫీజుల వసూళ్లకు మాత్రం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. పాఠశాలల్లో ఆట స్థలం లేక విద్యార్థులను ఆటలకు దూరం చేసి మానసిక ఒత్తిడి పెంచి వారు ఆత్మహత్యలకు పాల్పడేలా వ్యవహరించడం అన్యాయమన్నారు. తక్షణమే ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ గౌతమ్, డివిజన్ సభ్యులు అర్జున్, జనార్ధన్, జ్ఞానేశ్, కిరణ్, వరహాలు, హరీష్, శివ మోహన్, శేఖర్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బుడ్డడపాడులో జ్వరాలు

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలో పాత మల్లంపేట పంచాయతీ శివారు బుడ్డడపాడు గ్రామంలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో పలువురు మంచాన్ని పడ్డారు. జ్వర తీవ్రత పెరిగి పలువురు కేడీపేట నర్సీపట్నం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. కే.అశ్విని అనే ఐదు ఏళ్ల చిన్నారికి జ్వర తీవ్రత పెరగడంతో ఆమె కుటుంబ సభ్యులు ప్రైవేట్ క్లినిక్‌లో వైద్యం చేయించారు. అనంతరం పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్య సేవల కోసం వైజాగ్ కే జి హెచ్ ఆసుపత్రికి రెండు రోజుల క్రితం తీసుకెళ్లారు. ఆదివారం రాత్రి పరిస్థితి విషమించడంతో చిన్నారి మృతి చెందింది. గ్రామంలో ఇంకా పలువురు మలేరియా జ్వరాలతో మగ్గుతున్నారు. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ తూబిరి రాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామంలో నలుగురు జ్వరాలతో బాధపడుతున్నప్పటికీ వైద్య అధికారులు ఎవరూ సేవలు అందించలేదని తెలిపారు. దానికి కారణంగా గ్రామస్తులంతా ప్రైవేట్ క్లినిక్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఆరోగ్య సిబ్బంది ఎవరు కూడా తమ గ్రామానికి రాలేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా తమ గ్రామంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహించాలని ఆయన కోరారు.

స్థానిక విలేకరులు ఈ విషయాన్ని అధికారులతో మాట్లాడిన తర్వాత పంచాయతీ కార్యదర్శి రమణమ్మ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టారు.

ఈ విషయంపై స్థానిక పిహెచ్సి వైద్యాధికారి శ్యామ్ కుమార్ను వివరణ కోరగా తమ సిబ్బంది క్రమం తప్పకుండా గ్రామానికి వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారని, అయినప్పటికీ మలేరియా జ్వరాలు అదుపులోకి రాకపోవడంపై ప్రత్యేకంగా ఎంపీడీవో రమాదేవి పంచాయతీ కార్యదర్శులతో కలిపి కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించామన్నారు. మంగళవారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.



బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది